విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

మహాత్మా జ్యోతిబాపూలే గొప్ప దార్శనికుడు

- ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి

విశాలాంధ్ర-ఏలూరు: సమాన హక్కులకోసం, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధికోసం సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చిన మహాత్మా జ్యోతిబాపూలే గొప్ప దార్శనికుడని ఇన్ చార్జి కలెక్టర్ బి. లావణ్యవేణి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే 133వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్యవేణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి ఆర్.వి. నాగరాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి సత్యనారాయణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు, ఎపిఐఐసి జెడ్ఎం బాబ్జి, సెట్ వెల్ సిఇఓ యండి మెహరాజ్, కలెక్టర్ పరిపాలనాధికారి రమాదేవి, రజక సంఘం నాయకులు సిహెచ్ కట్లయ్య, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు చల్లన్న దొర, షా,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-ఏలూరు: ఓటుహక్కు పొందడమే కాకుండా దానిని వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగ స్వామ్యం కావా లని ఇన్‌చార్జి కలెక్టర్ బి. లావణ్య వేణి పిలుపు నిచ్చారు. " స్వీప్ "కార్యాచరణలో భాగంగా మంగళవారం స్థానిక సర్ సిఆర్ రెడ్డి కళాశాల నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ ర్యాలీలో సర్. సిఆర్ రెడ్డి కళాశాలకు చెందిన ఎన్ సిసి యూనిట్, నేషనల్ సర్వీస్ యూనిట్, ఇతర విద్యార్థినీ, విద్యార్థులు, పలువురు అధికారులు పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో ఓటరు నమోదు కోసం దరఖాస్తులను అందుబాటులో ఉంచారు. తొలుత సిఆర్ రెడ్డి కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో ఓటు హక్కు విలువ, సద్వినియోగం చేసుకోవాలని ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ బి. లావణ్యవేణి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా అర్హులని వారందరూ ఫారం-6 ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ల ను చైతన్యం పర్చి రానున్న ఎన్నికలలో తప్పకుండా ఓటు హక్కు వినియోగించేలా అవగాహన కల్పిద్దామన్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. జిల్లా పరిషత్ సిఇఓ కె. ఎస్.ఎస్. సుబ్బారావు మాట్లాడుతూ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం, పటిష్టమైన రాజ్యాంగంవున్న మన దేశంలో అర్హులైన వారంతా ఓటర్లుగా నమోదు కావాల న్నారు. డిశంబరు 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ప్రతి పోలింగ్ స్టేషన్ లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సర్.సిఆర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటే అతిబలమైన ఆయుధమని పేర్కొన్నారు. ఏలురు నగర మున్సిపల్ కమిషనరు ఎస్. వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాది ఓటుహక్కు అని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏలూరు తహశీల్దారు బి. సోమశేఖర్, యంపి డిఓ ప్రణవి, విద్యార్థులు పవన్, సురేష్ తదితరులు ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరించారు.

ప్లాస్టిక్ టిన్ పేలి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కలిదిండి: ప్రమాదకర రసాయనాలున్న ప్లాస్టిక్ టిన్ పేలి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ ప్రియ కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోరుకొల్లు గ్రామంలో చెన్నం శెట్టి బాలాజీ పాత ఇనుప దుకాణంలో పాత ఇనుము, ప్లాస్టిక్ టిన్నులు, రసాయనాలు కల ప్లాస్టిక్ టిన్నులను అమ్మకమునకు పెట్టగా గుడివాడకు చెందిన మోగసాల శ్రీనివాసరావు కు చెందిన ప్లాస్టిక్ యూనిట్ పనిచేస్తున్న బీహార్ కు చెందిన ముగ్గురు యువకులు సోమవారం లారీలో లోడ్ చేస్తుండగా రసాయనాలు కల ప్లాస్టిక్ టిన్ ఒక్కసారిగా పేలి పోవడంతో రాకేష్ సింగ్ (21) కు తీవ్రగాయాలై అక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య గర్భవతి అని, ఆమె బీహార్ లో ఉన్నట్లు తెలిపారు, రాకేష్ సింగ్ తో పనికి వచ్చిన లక్ష్మణ్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలాన్ని సిఐ లీలా కృష్ణ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం పట్టణంలో రహదారులు, భవనాల శాఖకు సంబంధించిన ఎకరం ప్రభుత్వ స్థలంలో గతంలో రహదారులు భవనాలు శాఖ గెస్ట్ హౌస్ ను నిర్వ హించేవారు. గెస్ట్ హౌస్ పూర్తిగా శిథిలమై పాడైపోవడంతో పట్టణంలో ఉన్న గెస్ట్ హౌస్ ను గత తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నూతన భవన నిర్మాణం ఏర్పాటు చేస్తారని అనుకున్నప్పటికీ, నూతన భవన నిర్మాణం జరగలేదు. అప్పటినుండి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ స్థలం ఖాళీగా ఉండడంతో జాతీయ రహదారిని ఆనుకుని గెస్ట్ హౌస్ స్థలంలో ఎదురుగా కొన్ని నెలల క్రితం వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని రాత్రి వేళల్లో ఏర్పాటు చేశారు. ఇప్పుడు మరలా ఆ విగ్రహం ప్రక్కనే మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని వైయస్సార్ పార్టీ నాయకులు నూతనంగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలలో అక్రమంగా దుకాణాలు, శిలా విగ్రహాలుఏర్పాటు చేయడం వలన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని పట్టణవాసులు వాపోతున్నారు. దీనిపై ఆర్ అండ్ బి డి ఇ హరికృష్ణను వివరణ కోరగా ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాలలో విగ్రహాలను ఏర్పాటు చేస్తే నోటీసులు జారీ చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: డిసెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ముద్దాయిలు సద్వినియోగం చేసుకోవాలని మొదటి అదనపు జూని యర్ సివిల్ జడ్జి జి.సురేష్ బాబు అన్నారు. భీమవరం ప్రత్యేక ఉప కారాగారాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి కారాగార సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని దీనికి సంబంధించి ఉచిత న్యాయ సహాయం అందచేస్తామన్నారు. తొలుత ఆయన కారాగారంలోని వంట శాలను, పదార్థాలను, జైలు ప్రాంగణాన్ని పరిశీలించారు. మురికి నీటి గుంటలు లేకుండా చూడాలని, మంచి వాతావరణం కల్పించాలని, సురక్షిత త్రాగు నీరు అందించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిలర్ ఎస్.సుధీర్, జైలు విజిటింగ్ లాయర్ బి.లోకేశ్వర రావు, ప్రత్యేక ఉప కారాగారం పర్యవేక్షణ అధికారి డి.వెంకట గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు నగరపాలక సంస్థ

బహిరంగ వేలము నోటీసు

ఆర్.ఓ.సి.నెం.84273/2023/ఎ1 తేది: 28-11-2023

ఏలూరు నగరపాలక సంస్థలో విలీనము కాబడిన **చోదిమెళ్ళ గ్రామ పంచాయతీనందు గల గవల్ల కోనేరు (చెరువు)ను** మూడు (3) సంవత్సరముల కాలమునకు బహిరంగ వేలము ద్వారా లీజుకు ఇచ్చుటకుగాను **ది. 07-12-2023 వ తేదిన ఉదయం గం॥ 11.00లకు** ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణయందు బహిరంగవేలము నిర్వహించుటకు నోటీసు జారీ చేయడమైనది.

వ.నెం	వివరము	చెరువు పేరు	మొత్తము చెరువు	డిపాజిట్ చెరువు	స్వాలెన్సీ
1.	చోదిమెళ్ళ గ్రామ పంచాయతి	గవల్ల కోనేరు (చెరువు)	1	50,000/-	రూ.9,00,000/-

ఇతర వివరములకు ఆఫీసు పని వేళలలో అడిగి తెలుసుకొనగలరు. సంప్రదించవలసిన **ఫోన్ నెంబర్ : 9849907144**

కమీషనర్, నగరపాలక సంస్థ, ఏలూరు.

గురువులపై గురి

- ఉపాధ్యాయులే లక్ష్యంగా వేధింపులు
- భయాందోళనలో ఉపాధ్యాయులు
- ఆందోళన బాట పట్టనున్న సంఘాలు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: గత కొన్ని నెలలుగా ఉపాధ్యాయులను అన్ని రకాలుగా ఇబ్బందులు పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా వారి కదలిక లపై, చేస్తున్న కార్యక్రమాలు, పాఠశాలల్లో విధులపై ప్రత్యేక నిఘా పెట్టింది. విద్యాశాఖ ఉన్నతాధికారు లతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎప్పటికప్పుడు నివేదికలు అందచేయాలని ఆదేశిం చింది. దీంతో ఉన్నతాధికారులు పాఠశాలలను సందర్శించడం, లోపాలు చూపెట్టి ఆగ్రహం వ్యక్తం చేయడం ఇటీవల ఎక్కువైంది. దీంతో ఎప్పుడు ఏ అధికారి వస్తారో, అకారణంగా తమను నిలదీస్తారోనన్న భయాందోళనలో ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రభుత్వంపై తిరగబడిన ఉపాధ్యాయ సంఘాల నేతలపై, టీచర్లపై ప్రభుత్వం వేధింపులకు దిగు తున్నట్లు చెబుతున్నారు. తమను ఇబ్బందులకు గురిచేసేందుకు షోకాజ్ నోటీసులు, చార్జి మెమోలు ఇస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కక్ష సాధింపులకు పాల్పడుతుందా?

ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందా...? అంటే జరుగుతున్న పరిణామాలు అవుననే చెబుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రభుత్వం నిర్బంధాన్ని పెంచిం దన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల ఆకస్మిక తనిఖీల పేరుతో టీచర్లను భయభ్రాం తులకు గురి చేస్తున్నారని ఉపాధ్యా యులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదో ఒక తప్పు పట్టుకుని అధికారులందరి ముందు అవమానించ డం, పరుష పదజాలం వాడటం చేస్తున్నారని ఉపాధ్యా యులు ఆరోపిస్తున్నారు. గతంలో జిల్లాలో పర్యటించినప్పుడు విధులు సక్రమంగా నిర్వర్తిం చడం లేదని, వర్క్ బుక్స్ సరిగా రాయించలేదని, రాసిన కూడా అన్ని తప్పులే ఉన్నాయని కారణా లతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఆర్జెడి, డీఈవో, ఎంఈఓలను నిలదీశారు. ఉపాధ్యాయు లపై చర్యలు తీసుకోకుంటే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు రోజువారీ కార్యక్రమాలలో భాగంగా పలు పాఠశాలలు సందర్శించి ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేయడం, నోట్ బుక్, వర్క్ బుక్ రాయించడంలో అలసత్వం ప్రదర్శించినట్లు చెబుతూ నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసులు అందు కున్న ఉపాధ్యాయులు 3 రోజుల్లో వ్రాతపూర్వకంగా డీఈఓకు సంజాయిషీ ఇవ్వాలని కోరుతున్నారు.

బోధనేతర పనులే ఎక్కువ

ఉపాధ్యాయులు నిత్యం యాప్‌లతో యాతన పడుతూ ప్రభుత్వ వేధింపులకు గురవుతున్నారు. పాఠశాలలో బోధన కంటే బోధనేతర పనులపైనే వారు ఎక్కువ సమయం గడపాల్సి వస్తోంది. పిల్లలకు బోధించడానికి 8 పీరియడ్లు ఉంటే యాప్ లను నిర్వహించడానికి రోజుకు మూడు నాలుగు గంటల సమయం పడుతుందని ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు. పాఠశాలలకు సమయానికి హాజరు కావడం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, ఫోటోలు అప్‌లోడ్, ముఖ హాజరు అప్ లోడ్, టీచింగ్ నోట్స్ రాయడం, వర్క్ బుక్ కరెక్షన్ చేయడం, సిలబస్ ఎంతవరకు పూర్తి చేశారన్న విషయాలన్నీ నిత్యం మెసేజ్ పెట్టడం, స్టాక్ రిజిస్టర్లు పక్కాగా నిర్వహించడం, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలతో పాటు అధికారుల సమావేశాలు, విద్యా సంబంధిత కార్యక్రమాలు తదితర బోధనేతర పనులలో ఉపాధ్యాయులు బిజీగా ఉంటున్నారు. మరోవైపు విద్యాశాఖ ఉన్నతా ధికారులు పాఠ్యాంశాల బోధన సకాలంలో పూర్తి చేయాలని, పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఒత్తిడి చేస్తు న్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తమపై కక్షగట్టి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల పట్ల చులకనభావం

ఉపాధ్యాయులను వేధించడమే లక్ష్యంగా ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని ఉపాధ్యాయ సంఘాల నేతలు చెబుతున్నారు. పాఠశాల పర్యవేక్షణ పేరుతో భయాందోళనకు గురి చేయడంతోపాటు, ఉపాధ్యాయుల పట్ల చులకన భావం ఏర్పడేలా అధికారులు వ్యవహరిస్తున్నారని వారు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పట్టించుకోకుండా చిన్నచిన్న కారణాలతో ఉపాధ్యాయులను షోకాజ్ నోటీసులతో బెదిరిం చడం ఎంతవరకు సమంజసం అని నేతలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు జారీ చేసిన నోటీసులు వెంటనే ఉపసంహరించాలని సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే సంఘాలన్నీ ఐక్య కార్యాచరణతో పోరాడుతామని తెలుపుతున్నారు.

ఉపాధ్యాయులను వేధించడం సరికాదు
ఎల్. సాయి శ్రీనివాస్, ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు

ఉపాధ్యాయులను ఒత్తిడి చేస్తున్న ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించకపోవడం సరికాదని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్. సాయి శ్రీనివాస్ అన్నారు. 3 నుండి 10వ తరగతి వరకు సంబంధించిన వర్క్ బుక్స్, నోట్ బుక్స్ సరిగా లేవనే కారణాలు చూపించి ఉపాధ్యాయులకు చార్జీ మెమోలు జారీ చేయడంతో పాటు, ఆర్థిక మూలాలపై దెబ్బ కొడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ దుర్మార్గపు చర్యలు చూస్తూ ఊరుకోబోమని, పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

జిల్లాకే మణిహారం విద్యుత్ ఉపకేంద్రం

వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం సరిపల్లి - కొత్తపల్లి గ్రామాల్లో సుమారు 61 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు కానున్న 132/33 విద్యుత్ ఉప కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి ట్రాన్స్మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉప కేంద్రాన్ని వర్చువల్ గా శంకుస్థాపన చేశారు.గణపవరం వరదరాజపురం 33/11 కె.వి విద్యుత్ కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన సభా వేదిక నుండి నుండి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, ఉంగుటూరు నియోజకవర్గం శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసు బాబు), తదితరులు ముఖ్యమంత్రిచే శంకుస్థాపన కార్యక్రమాన్ని వర్చువల్ గా తిలకించారు.అనంతరం సభా వేదిక పక్కన ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆవిష్కరించారు.అనంతరం జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి మాట్లాడుతూ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం వలన గణపవరం, నిడమర్రు, అత్తిలి మండలాల్లోని ఒక లక్ష ఐదు వేల మంది వినియోగదారులు లబ్ధి పొంద నున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో అభివృద్ధి జరుగుతున్న పారిశ్రామిక, వ్యవసాయ, గృహ, ఆక్వా అవసరాలు తీర్చుటకు గణపవరం మండలం సరిపల్లి (కొత్తపల్లి) గ్రామంలో ఏపీ ట్రాన్స్కో ద్వారా విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్కో ఎస్.ఇ ఓ.వి.జె.రాజా, నిడదవోలు ఇ ఇ ఓ, ఏం ఆర్.వి.శ్రీధర్, డి.ఇ కన్స్ట్రక్షన్స్ బి.రామకృష్ణ, ఉండి డి.ఇ.ఇ లైన్స్ బి. గోపాల్, తాడేపల్లి గూడెం డి.ఇ.ఇ ఆపరేషన్స్ బి.రామ కృష్ణ, ఎఇఇ కన్స్ట్రక్షన్స్ పి.సునీల్, గణపవరం ఎ.ఇ ఆపరేషన్స్ కె.ఎస్.ఎన్ ప్రసాద్, ఎ.ఇ టెలికామ్ దయాసాగర్, భీమవరం ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు, ఏపి సూర్య బలిజ కార్పొరేషన్ చైర్పర్సన్ శెట్టి అనంత లక్ష్మి, ఏలూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వేజ్జు వెంకటేశ్వరరావు, సిపివో కె శ్రీనివాస రావు, తహశీల్దారు పి లక్ష్మి, యంపిడివో జి జ్యోతిర్మయి, జడ్పీటిసి సభ్యులు దేవరపు సోమలక్ష్మి, యంపిపి దండు వెంకట రామరాజు, గ్రామ సర్పంచులు గుర్రం సుబ్బా రావు, మద్దాల రత్న కుమారి, యంపిటిసి సభ్యులు మద్దాల నాగేశ్వర రావు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

పాలవాగు కాల్వ మరమ్మతులకు చర్యలు

విశాలాంధ్ర - లింగపాలెం : పాలవాగు కాల్వను మరమ్మతులు చేయించేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడ తానని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం ఆయన పాలవాగు కాల్వను పరిశీలించారు. ఇటీవల ఎంపీ కోటగిరి శ్రీధర్ తనకు కేటాయించిన నిధుల నుంచి దాదాపు రూ. 70 లక్షలు మంజూరు చేసి కాల్వ అవుట్ లెట్‌ను మరమ్మతులు చేయించారు. అవుట్‌లెట వదద నిర్మించిన యాప్రాన్‌కు ఇరువైపుల గోడలు నిర్మించటం, కింద భాగం దెబ్బతినకుండా కాంక్రీట్ వేయాలని మండల వైసీపీ అధ్యక్షుడు కొఠారు మోహన్ ఎంపీని కోరారు. దీనిపై ఎంపీ శ్రీధర్ ఈ సమస్యను సబ్ కలెక్టర్‌కు వివరించటంతో ఈయన కాల్వను స్వయంగా పరిశీలించారు. ఆయకట్టు రైతులకు ఉపయోగపడే విధంగా కాల్వను మరమ్మతులు చేయాల్సి ఉందని, దీనికి సంబంధించి ఇరిగేషన్ శాఖ అధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటానని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈయనతోపాటు తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ ఉన్నారు. వైసీపీ మండలాధ్యక్షుడు కొఠారు మోహన్ సబ్ కలెక్టర్‌ను కలిసి పలు వినతులు వివరించారు.

ఉరేసుకుని ఆత్మహత్య

విశాలాంధ్ర - లింగపాలెం : వేములపల్లిలో ఉరేసుకుని బంటు నాని(35) ఆత్మహత్య చేసుకున్నాడు. తన కొడుకుకు వ్యవసాయంపై అప్పులు ఉండటంతో ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి చిన సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య మమతారాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

1న విభిన్న ప్రతిభావంతులకు జిల్లాస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర-ఏలూరు: డిసెంబర్ 5న ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ ఒకటవ తేదీ శుక్రవారం ఉదయం గం.8లకు ఏలూరు ఇండోర్ స్టేడియం లో విభిన్న ప్రతిభావంతులకు జిల్లాస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి రాకాడ మణీ తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ లక్ష్యంగా విద్యుత్ ఉప కేంద్రాలు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లా పరిధిలో రూ. 251.31 కోట్లతో నాలుగు విద్యుత్ ఉప కేంద్రాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ విజయవాడ క్యాంపు కార్యా లయం నుండి వర్చువల్ విధానంలో శంఖుస్థాపన, ప్రారంభోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఏలూరు జిల్లా కొప్పాక గ్రామంలో రూ. 139.66 కోట్ల వ్యయంతో 220/132/33 కె.వి. విద్యుత్ ఉప కేంద్రం నిర్మించుటకు ఎపి ట్రాన్స్‌కో మంజూరు చేసిన విద్యుత్ ఉప కేంద్రాన్ని శంఖుస్థాపన, టి. నర్సాపురంలో రూ. 60.20 కోట్ల వ్యయంతో ద్వారకా తిరుమలలో రూ. 28.89 కోట్ల వ్యయంతో నారాయణపురంలో(నల్లమాడు)లో రూ. 22.62 కోట్ల వ్యయంతో నిర్మించిన 132/33 కె.వి. విద్యుత్ ఉపకేంద్రాలను వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా 28 సబ్ స్టేషన్లకు ఎపి ట్రాన్స్ కో శ్రీకారం చుట్టిందని అన్నారు. ఏలూరు జిల్లా కొప్పాక విద్యుత్ ఉప కేంద్రం శంఖుస్థాపన కార్యక్రమానికి జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి, ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్, జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ లతో కలిసి వర్చువల్ ద్వారా ముఖ్యమంత్రి శంఖుస్థాపనచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ ఎంతో కాలంగా లోఓల్టేజీతో ఇబ్బంది పడుతున్న ప్రజానీకానికి విద్యుత్ ఉప కేంద్రాల ఏర్పాటు ద్వారా నాణ్యమైన విద్యుత్ పొందవచ్చన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ ఉప కేంద్రాల ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న లోఓల్టేజీ సమస్య, రైతుల సమస్యలు తీరబోతున్నాయని తెలిపారు. జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ బి. లావణ్యవేణి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో టి.నర్సాపురం, ద్వారకాతిరుమల, నారాయణ పురం, మండలాల్లోని గ్రామాలకు ఉన్న విద్యుత్ సమస్యను తీరబోతుందని తెలిపారు. కొప్పాక సబ్ స్టేషన్ ద్వారా రాబోయే రోజుల్లో ఏలూరు, పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాల్లో సుమారు 4 లక్షల మంది విద్యుత్ వినియోగ దారులకు లబ్దిచేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ ఎస్ ఇ సాల్మన్ రాజు, సర్పంచ్, జెడ్పిటిసి, యంపిటిసిలు, విద్యుత్ శాఖ ఎడిలు, డిఇలు, ఏఇలు, విద్యుత్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబా పూలే

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం: మహాత్మ జ్యోతిబాపూలే గొప్ప సాంఘిక సంస్కర్త అని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్య క్షులు డి. సోమ సుందర్ కొనియా డారు. జ్యోతిబాపూలే 133 వ వర్ధంతి సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ వద్దగల జ్యోతిబాపూలే విగ్రహానికి మంగళవారం సోమ సుందర్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సోమ సుందర్, లక్ష్మణరావు లు మాట్లాడుతూ దేశంలో మహిళాభ్యుదయానికి కృషి చేసిన ప్రముఖ సంఘసంస్కర్తలలో జ్యోతిరావు పూలే ప్రముఖులని కొనియాడారు. సమ సమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. దేశంలోనే తొలిసారిగా బాలికల విద్య కోసం పాఠశాలను స్థాపించారని తెలిపారు. బాల్య వివాహాలను వ్యతిరేకించి వితంతు వివాహాలను ప్రోత్సహించారని తెలిపారు. ఆయన చేసిన కృషి ఫలితంగానే కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అందరికీ విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాటికొండ వాసు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కంకట రత్నకుమార్, ఎమ్మార్పీఎస్ తాడేపల్లిగూడెం నియోజకవర్గం కన్వీనర్ దేవతల శివాజీ, విశాలాంధ్ర ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో బెజవాడ బ్రహ్మయ్య, విశాలాంధ్ర పెంటపాడు విలేఖరి ఎస్. రాంబాబు, ఏఐటీయూసీ నాయకులు ఎం హరీష్, ఎం కాటంరాజు, అల్లం నరేంద్ర కుమార్, కార్యకర్తలు యాలం నర్సన్న, టి.వెంకటేష్, ఎం సత్యనారాయణ, వై రత్నరాజు, కే నాగ ముని, పెంటపాటి పుల్లారావులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాడతాం

విశాలాంధ్ర - వేలేరుపాడు : ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేవరకు వెనకడుగు వెయ్యకుండా పోరాటాలు కొనసాగిస్తామని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కారం దారయ్య పేర్కొన్నారు. విజయవాడలోని జింఖానా గ్రౌండ్‌లో ప్రారంభమైన 36 గంటల కార్మిక, రైతాంగ మహా ధర్నాకు మంగళవారం ఏఐటీయూసీ యూనియన్‌లోని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్, ఆశా వర్కర్లు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో కనీస వసతులు లేని మారుమూల గ్రామాల్లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులపై ప్రభుత్వాలకు ఏమాత్రం కనికరం లేదన్నారు. పదేపదే తమ సమస్యలను పరిష్క రించమని మొరపెట్టుకున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మికులు, రైతులు పడుతున్న ఇబ్బందులు తెలియాలన్నారు. మహాధర్నాకు అంగన్‌వాడీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కౌలూరి సైదా, మండల కార్యదర్శి కమ్మిచిప్ప రమాదేవి, ఆశ వర్కర్ల మండల కార్యదర్శి కారం కుమారి, నాయకులు పత్ర లీలావతి, వెంకట లక్ష్మీ, పిట్టా రమాదేవి, దార్ల నిర్మల, కుంజ వెంకటలక్ష్మి, రాజేశ్వరి, ధర్మల కమల, మడకం బద్రి తదితరులు వెళ్లారు.

రైతును కాపాడుకోవాలంటే
మోదీని గద్దె దింపాలి

రైతు సంఘం రాష్ట్ర నాయకులు దేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: కార్మిక, కర్షక డిమాండ్ల సాధన కోసం, కార్మిక సంఘాలు- రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వ ర్యంలో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో రాష్ట్ర మహా ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు దేగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలతో సాగు చేస్తూ దేశానికి అన్నం పెడుతుంటే, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు.
రైతులకు గిట్టబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందడం వలన ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు సరైన ధర లభించక ఈ దేశంలో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పోరాటాల ద్వారా కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం 4 కోడ్‌లు గా చేయ డం ద్వారా కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేశారని, ఇటువంటి కార్మిక,కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపడానికి, భవిష్యత్తు పోరాటాలకు ఈ మహా ధర్నా నాంది పలకాలని పిలుపునిచ్చారు. రెండో రోజు మహాధర్నాలో ది ఏలూరు కార్ వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ అధ్యక్షులు ఉప్పులూరి హేమ శంకర్, కోశాధికారి కాటూరి శ్రీధర్, కమిటీ సభ్యులు కువ్వరాపు ప్రియనాథ్, పొన్నా ధర్మ రాజు, పాలకొండ శ్యామ్ ప్రసాద్, వీర్ల జగన్నాథం, బేతా శంకర్, లైసెన్సు పోర్టర్స్ ఏలూరు కమిటీ సభ్యులు ఆదినారాయణ, కోటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పోటెలు పెంటయ్య, బుగ్గల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర పేర్లు నమోదు చేసుకోండి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర -భీమవరం: ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర వ్యాప్త క్రీడా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తిగల క్రీడాకారులందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. మంగళ వారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి సంయుక్తంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించడానికి, క్రీడల ద్వారా ఆరోగ్య కరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి ప్రతిభావంతులైన క్రీడాకారులను కనుగొని వారిని పెద్ద వేదికకు పరిచయం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా కార్యక్రమాన్ని డిసెంబర్ 15వ తేదీ నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహిస్తోందన్నారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ అనే ఐదు క్రీడా విభాగాల్లో పోటీలు ఉంటాయని, 15 సంవత్స రాల పైబడిన పురుషులు,మహిళలు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వారికి వేరువేరుగా పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 1902 కి కాల్ చేయడం గానీ లేదా సమీపంలోని సచివాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

అణగారినవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన పూలే

విశాలాంధ్ర - నిడమర్రు: అణగారిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక సంస్కరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన వైతాళికుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాస రావు (వాసు బాబు) అన్నారు. మంగళవారం నిడమర్రు మండలం బువ్వనపల్లి క్యాంపు కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావుపూలే 133 వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా ఆలోచనలకు అనుగుణంగా బిసిలకు మేలు సామాజిక విలువలు వర్ధిల్లడానికి, సమానత్వ సాధనకు కృషి చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిలారి సత్యవతి,గణపవరం సర్పంచ్ మూరా అలంకారం, రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, గణపవరం ఎంపీపీ దండు వెంకటరామరాజు(అర్ధవరం రాము), నిడమర్రు ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పిటిసి సభ్యులు కోడే కాశీ, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ సంకు సత్యకుమార్, కిలారి రవిబాబు, వెల్లంకి నరేష్, వైస్ ఎంపీపీ సమయం వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడలో మౌలిక వసతుల కల్పన

విశాలాంధ్ర -తణుకు: తణుకు - తేతలి సరిహద్దుల్లో ఉన్న ఏపీఐఐసీకు చెందిన పారిశ్రామికవాడలో రూ.9 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు రేపు ముఖ్యమంత్రి జగన్ ఆన్ లైన్ లో శ్రీకారం చుట్టనున్నారని ఎస్టేట్ ఛైర్పర్సన్ వంక రాజ కుమారి తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా అభివృద్ధి ఎటువంటి గ్రాంట్ లేకపోవడంతో, రోడ్లు అన్ని శిథిలావస్థకు వచ్చాయని డ్రైన్లు కూడా పూడుకుపోయాయని , ఇప్పుడు అన్ని సమస్యలు పరిష్కారం కానున్నాయని రాజకుమారి అన్నారు . గత సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ లో ఎం ఎస్ ఎం ఈ ద్వారా పెట్టిన 3 ప్రపోజల్ లో తణుకు ఒకటిని కార్యరూపంలోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి కి చిన్నపరిశ్రమల యజమానులు అభినందనలు తెలియజేస్తున్నారని వంక రాజకుమారి తెలిపారు.

గ్రామపంచాయతీ పరిపాలన విధానంపై శిక్షణ

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రతి ఒక్కరూ గ్రామ పంచాయతీ పరిపాలన విధానం పై అవగాహన కలిగి వుండాలని ఎంపిడీఓ మంగా కుమారి తెలిపారు.స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యా లయంలో గ్రామ పంచాయతీ పరిపాలన విధానం పై ప్రజా ప్రతినిధులు, అధికారు లకు శిక్షణా తరగతులు పంచాయతీ విస్తరణ అధికారి ఎం. రాంప్రసాద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంగా కుమారి మాట్లాడుతూ గ్రామ పరిపాలన పై పంచాయతీ రాజ్ 1994 చట్టం ప్రకారం సెక్షన్లు, రూల్స్, రికార్డు కస్టోడియన్ విధి విధానాల అమలు తీరుపై అవగాహన సదస్సు నిర్వ హించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ,ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల వివరాలు సమర్పించండి

విశాలాంధ్ర -భీమవరం: మార్చి నెలలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే దివ్యాంగుల వివరాలను పాఠశాలల హెచ్‌ఎంలు తమ కార్యాల యంలో ధృవీకరించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు నామినల్ రోల్సులో విషయాలు పొందిపరిచిందీలేనిది పరిశీలించుకోవాలని, జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో హెచ్‌ఎంలు దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల కలర్ జిరాక్సులను సమర్పించాలని తనిఖీ సందర్భంగా ఒరిజినల్ సదరం సర్టిఫికెట్లు తీసుకొని రావాలని సూచించారు.

జగనన్న ఇళ్ల ప్రగతి వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు : జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతిని వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా మేనేజర్ కె. రవికుమార్ అధికారులను ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతి తీరుపై తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లతో మంగళవారం కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నదని, జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణాల పనులను వేగవంతం చేసేందుకు డిసెంబర్ 1వ తేదీ నుండి జనవరి, 30వ తేదీ వరకు 60 రోజులపాటు ప్రత్యేకంగా 'మెగా కంప్లీషన్ డ్రైవ్ ను నిర్వహించడం జరుగుతుంద న్నారు. ఈ డ్రైవ్ లో ఇప్పటికే ప్రారంభించిన 21 వేల ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులకు పిలుపునిచ్చారు.

అందరి భాగస్వామ్యంతో ఆడుదాం.. ఆంధ్ర

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రంలో 15 ఏళ్లు వయస్సు పైబడిన అన్ని వయస్సుల వారిని క్రీడల్లో భాగ స్వామ్యం చేయడం ద్వారా శారీరక, మానసిక ధృడత్వం, ఆనందాన్ని సొంతం చేసుకొనే దిశగా నిర్వహి స్తున్న ఆడుదాం..ఆంధ్ర క్రీడోత్సవాల్లో ప్రతిఒక్కరూ భాస్వామ్యం కావాలని ఇన్ చార్జి కలెక్టర్ బి. లావణ్యవేణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం డిశంబరు 15 నుంచి నిర్వహించే ఆడుదాం..ఆంధ్ర క్రీడోత్సవాల నిర్వహణ ఏర్పాట్లను ఇన్ చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి పాత్రికేయులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా యువతను క్రీడల్లో ప్రోత్సాహాన్ని పెంచడానికి, క్రీడలుపట్ల మక్కువ, ఆరోగ్యకరమైన జీవనాన్ని సాధించడానికి ఆడుదాం.. ఆంధ్ర క్రీడల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ టోర్నమెంట్ మొత్తం 51 రోజుల పాటు పండగలా జరగ నున్నదన్నారు. గ్రామ/ వార్డ్ స్థాయి లో 18రోజులపాటు డిసెంబర్ 15 నుండి జనవరి 1 వరకు మండలస్థాయి లో 14 రోజుల పాటు జనవరి 2 నుండి జనవరి 15 వరకు నియోజకవర్గస్థాయి లో 6రోజుల పాటు జనవరి 16 నుండి జనవరి 21 వరకు జిల్లా స్థాయిలో వారం రోజులపాటు - జనవరి 22 నుండి జనవరి 28 వరకు రాష్ట్ర స్థాయి లో 6 రోజులపాటు జనవరి 29 నుండి ఫిబ్రవరి 2 వరకు క్రీడోత్సవాలు నిర్వహించబడతాయని 2024 ఫిబ్రవరి 3వ తేదిన మన ఆడుదాం ఆంధ్ర విశాఖపట్టణంలో ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సెట్ వెల్ సిఇఓ ఎండి మోహరాజ్, డిఎస్ డిఓ బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు 9 మంది ఎస్ఆర్కెఆర్ విద్యార్థులు

విశాలాంధ్ర -భీమవరం: జెఎన్టియు కె తరపున జాతీయస్థాయిలో వివిధ యూనివర్సిటీల మధ్య జరిగే ఇంటర్ యూనివర్సిటీ, సౌత్ జోన్ పోటీలకు ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 9 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణ రాజు అన్నారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన క్రీడాకారులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు మాట్లాడుతూ సెంట్రల్ జోన్లో ఎన్నో విజయాలు సాధించిన తమ కళాశాల క్రీడాకారులు సౌత్ జోన్ లో కూడా మంచి ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ హరిమోహన్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్ విభాగంలో పి.రక్షిత, తేజస్వి, వాలీబాల్ విభాగములో కె.వికాస్ బాబు, జై.మానస , హ్యాండ్ బాల్ విభాగంలో బి.చైతన్య లహరి, ఆర్.అఖిల శ్రీవల్లి, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్ బాల్ పోటీలకు తమ కళాశాల నుండి ఎంపికైన క్రీడాకారుల్లో పి.రిషిక, విజయ సాహితీ, వర్మ, షేక్ నిషా, జి.శ్రీనివాసరావు ఎంపికయ్యారన్నారు. ఇంటర్ కాలేజీఏట్ సెంట్రల్ జోన్ విభాగంలో బ్యాడ్మింటన్ లో సెంట్రల్ జోన్లో మహిళా విభాగం రన్నర్స్ గాను, వాలీబాల్ ఉమెన్స్ విభాగంలో మూడవ స్థానంలోనూ నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ జి.సారిక, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

విశాలాంధ్ర - కైకలూరు : మండలంలోని కైకలూరు111, ఆటపాక131, గోనేపాడు132 వ బూత్ లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెన్మత్స త్రినాథ్ రాజు, క్లస్టర్ పోలవరపు లక్ష్మీ రాణి ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ - జనసేన పార్టీ పర్యవేక్షణలో జరుగుతున్న బాబు తో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు - పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన వెంటనే 2024 జూన్ నెల నుండి ప్రతి కుటుంబానికి వచ్చే సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అన్నారు. అనంతరం పార్టీ విధానాలను వివరిస్తూ మహిళలకు భవిష్యత్తుకు గ్యారెంటీ - ఇది బాబు గ్యారెంటీ హామీ పత్రాలను అందిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు పెన్మేత్స వెంకటేశ్వర రాజు(వెంకటరాజు), ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు వీరమల్లు నరసింహారావు, టిడిపి నాయకులు బి.కె.యమ్ నాని,రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వ హక కార్యదర్శి పూల రామచంద్రరావు(రాజీ),వీరాబత్తిన సుధ, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్(బాబి), భుజబలపట్నం మాజీ సర్పంచ్ గుజ్జుల రామలక్ష్మి,మండల తెలుగు మహిళా కార్యదర్శి శీలం కృష్ణవేణి,కైకలూరు పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు పడమట వాసు, రుద్రరాజు రాజా,పలివెల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని చింతలపూడి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈ.ఆర్.ఓ),స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే.గీతాంజలి సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఓటరు నమోదుపై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్. ప్రసాద్ బాబు అధ్యక్షతన సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ మరియు ఎలక్టోరల్ పార్టిసిపేషన్ వారి ఆధ్వర్యంలో జరిగింది.

ఈ కార్యక్రమానికి చింతలపూడి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈ.ఆర్.ఓ),స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే.గీతాంజలి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె నూతన ఓటు నమోదు పై అవగాహన కల్పించారు.18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తమ తమ గ్రామాల్లో ఉన్న బీఎల్ ఓ లను కలిసి ఓటు నమోదు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమం అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎఈఆర్ఓ, తహశిల్దార్ కే. స్లీవ జోజి,చింతలపూడి ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ శేఖర్ బాబు,కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి. శ్రీనివాసరావు, పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు,ఎమ్.శ్రీనివాసరావు,అధ్యాపకులు యు.వెంకటా చార్యులు, సిహెచ్. బదరీ నారాయణ తెలుగు విభాగం నుంచి డా. జి వెంకట లాల్, వి. హనుమంతరావు, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సమైక్యత చాటేందుకు వన మహోత్సవాలు

విశాలాంధ్ర - లింగపాలెం : సమైక్యత కోసం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బిజెపి ఆధ్వర్యంలో వన మహోత్సవాలను నిర్వహి స్తున్నామని ఈ పార్టీ జిల్లా అధ్యక్షులు చవటపల్లి విక్రమకిషోర్ తెలిపారు. ధర్మాజీగూడెంలో మంగళవారం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిం చారు. డిసెంబరు 2 నుంచి వనమహోత్సవాలు మొదలవుతాయని, 2న ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలకు గోపన్నపాలెం, 5న చింతలపూడి, పోలవరం నియోజకవర్గాలకు జంగారెడ్డిగూడెంలో, 7న నూజివీడు నియోజకవర్గానికి నూజివీడులో, 9న కైకలూరు నియోజకవర్గానికి కైకలూరులో, 11న ఉంగుటూరు నియోజకవర్గానికి ఉంగుటూరులో వన మహోత్సవాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీటికి ముఖ్యఅతిధులుగా అగ్ర నాయకులు హాజరవుతారని వివరించారు. ఆర్ఎస్ఎస్ సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి, జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామంజనేయచౌదరి(తపన చౌదరి), జాతీయ కార్యదర్శి సత్యకుమార్, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి ఎపిఆర్ చౌదరి వన మహోత్సవాలలో పాల్గొంటారని తెలిపారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే

విశాలాంధ్ర-ఏలూరు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని ఆంధ్రప్రదేశ్ బీసీ, ఓ బి సి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్వీఆర్ విఠల్ కొనియాడారు.మహాత్మ జ్యోతిబాపూలే 134 వ వర్ధంతి సందర్భంగా ఏపీ బీసీ, ఓబిసి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ వద్ద గల మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలవేసి, నివాళులర్పించారు. సందర్భంగా విఠల్ మాట్లాడుతూ దేశంలోనే అంటరానితనం ను ఎదిరించిన మొట్టమొదటి సంఘ సంస్కర్తగా , స్త్రీలకు విద్య అవసరమని, సమాన హక్కులు, వితంతువులకు వివాహాలు చేయటం వంటి అనేక స్త్రీ జనార్ధరణ కార్యక్రమాలు చేపట్టారన్నారు. మొట్టమొదటి మహాత్మా అని పిలిపించుకున్న మహెూన్నత మైన వ్యక్తి అని పలుపురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ పామర్తి ఏసు రాజు, దేవరకొండ వెంకటేశ్వరరావు, ఎస్టీ ఎంప్లాయిస్ అధ్యక్షులు,,టౌన్ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీనారాయణ, మార్గాని శ్రీనివాస్, , రాష్ట్ర యాదవ్ సంఘ అధ్యక్షులు ఉక్కు సూరి గోపాలకృష్ణ , రాజు, విశ్వబ్రాహ్మణ సంఘం డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి,అజయ్ బాబు, అచ్యుత్ పూలే, ఆదిశేషు, సూర్యం మాస్టారు,హుస్సేన్,మట్ట నాగేంద్ర, ఎంవి సుబ్బారావు, రామ సూరి,వివిధ బీసీ సంఘాల నాయకులు, ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో: మహాత్మ జ్యోతిరావు పూలే చిరస్మరణీయులని ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ , వైసీపీ రాష్ట్ర నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతిని ముదినేపల్లి సెంటర్లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విగ్రహ కమిటీ అధ్యక్షులు పళ్ళెం పుణేశ్వరరావు సభ్యులు జన్ను వీర వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ ప్రాంగణంలో కార్యాల యం ఎఓ రమణబాబు, సీనియర్ అసిస్టెంట్ ఎం నాగేశ్వరరావు , జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ముదినేపల్లి సెంటర్లో కైకలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మంగనేని బాబ్జి, నాయకులు గోళ్ళ రాజ్ కుమార్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి బడుగు , బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

కైకలూరులో: మండలంలోని ఆటపాకలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం (మాగంటి నిలయం) లో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సామాజిక అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసి అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేసిన సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 133 వ వర్థంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పెన్మేత్స త్రినాథ్ రాజు, ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు వీరమల్లు నరసింహారావు,పెన్మేత్స వేంకటేశ్వరరాజు(వెంకటరాజు), మాజీ జడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మి,బి.కె.యమ్ నాని, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు(రాజీ),తెలుగు దేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ,కైకలూరు పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు పడమట వాసు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో : బడుగు, బలహీన వర్గాల పాలిట ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని చింతలపూడి ఎమ్మెల్యే వీ.ఆర్. ఎలిజా అన్నారు. స్థానిక చింతలపూడి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 133 వ వర్ధంతి కార్యక్రమం పట్టణ వైసీపీ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే ఎలీజా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలిజా మాట్లాడుతూ అంటరాని తనం, కుల వ్యవస్థ నిర్మూలన కు పూలే ఎంతగానో పోరాడారని అన్నారు.మహిళలు, అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించడంలో ఆయనతో పాటు ఆయన భార్య సావిత్రీబాయి పూలే చేసిన కృషి వల్ల భారతదేశంలో స్త్రీల విద్యకు మార్గదర్శకు లయ్యా రని అన్నారు. అనంతరం ఆర్టీసి బస్టాండ్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి వైసీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు,వైసీపీ నాయకులు మండవల్లి విజయ సారథి,మేడవరపు విద్యాసాగర్ ,షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, కౌన్సిలర్లు ఎల్వీఆర్, నేకూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో : మహిళాభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన గొప్ప వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని వైసిపి మండల కన్వీనర్ కడలి ధర్మారావు తెలిపారు. మహాత్మా జ్యోతి రావు పూలే వర్ధంతి సంద ర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్లో మంగళవారం పూలే చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే వంటి మహనీయుని అడుగు జాడలలో నడిచి సమసమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఎఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు మాట్లాడుతూ పూలే అంటరాని ప్రజల హక్కులకోసం, బాల్య వివాహాల నిర్మూలన కోసం సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాల వంటి సామాజిక రుగ్మతల నిర్మూలనపై పోరాటం చేసారన్నారు. గ్రామ సర్పంచ్ చికిలే మంగతాయారు మాట్లా డుతూ సమాజంలో మహిళల అణిచివేతపై పోరాడిన ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నూకల కనకారావు, ఏఎంసి డైరెక్టర్ మతల కాశి, వీరవల్లి రాధాకృష్ణ, పాలా నాగరాజు, పేరాబత్తుల బాబి, మద్దాల బాబి, సురేష్, బాబి, పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నం పేటలో స్మశాన వాటికను అభివృద్ధి చేయించిన చిన్నం

విశాలాంధ్ర -చాట్రాయి : చిన్నంపేటలో దళితుల స్మశాన వాటికను నూజివీడు మాజీ శాసనసభ్యులు చిన్నం రామ కోటయ్య అభివృద్ధి చేయించారు. నూజివీడు శాసనసభ స్థానం నుండి పోటీ చేయాలని ముందుకు వస్తున్న చిన్నం రామకోటయ్య ఇటీవల తన అనుచరుడు కొమ్ము సృజనరావు నివాసానికి వచ్చిన ఆయనను గ్రామానికి చెందిన పలువురు దళితులు స్మశాన వాటిక సమస్యను వివరించడంతో స్పందించిన రామకోటయ్య స్మశాన వాటికను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయించుకోవాలని దానికి అయ్యే ఖర్చులు తానే ఇస్తానని చెప్పడంతో కొమ్ము సృజన్ రావు మాజీ సర్పంచ్ కునికేరి నాగమల్లేశ్వరరావులు స్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్ చేయించి స్మశాన వాటిక లోకి వెళ్లే దారిని కూడా అభివృద్ధి చేశారు. రెండు దళిత వాడలలో వేలాదిమందికి ఉపయోగపడే పని చేయించిన రామ కోటయ్య మేలు ఎన్నటికీ మరువలేమని పలువురు దళితులు కొనియాడుతున్నారు.

మహాత్మా జ్యోతిరావుపూలేకు టీడీపీ నివాళులు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ తాళ్లరేవు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక తాళ్ళరేవు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూలే చిత్ర పటానికి టీడీపీ శ్రేణులతో కలసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి) మాట్లాడుతూ పూలే అణగారిన వర్గాల అభ్యున్నతికి, వారి విద్యాభివృద్ధికి కృషి చేసిన సంఘసంస్కర్త సామాజిక తత్వవేత్త అన్నారు. కులవివక్షకు వ్యతిరేకంగా నాలుగు దశాబ్దాల పాటు సామాజిక ఉద్యమం నడిపిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని, ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, వెంటపల్లి ఉమామహేశ్వరి, అమలాపురం పార్లమెంటు బిసి సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు, అధికార ప్రతినిధి టేకుమూడి లక్ష్మణరావు, కార్యాలయ కార్యదర్శి మందాల గంగ సూర్యనారాయణ, జక్కల ప్రసాద్ బాబు, వాశంశెట్టి శ్రీనివాసరావు, గంజా సూరిబాబు, నడింపల్లి వినోద్, వరదరాజు, దుర్గా ప్రసాద్, చంద్రమౌళి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

విశాలాంధ్ర-దేవరపల్లి : :కార్తీక మంగళవారం పురస్కరించుకుని దేవరపల్లిలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో భారీ స్థాయిలో అన్న సమారాధన నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, సింధూరం తమలపాకులతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో మంగళ వారాల రోజున అన్న సమాధాన నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయుడి విశిష్టతను తెలిపారు.

ఘనంగా నాయి బ్రాహ్మణ వన సమారాధన

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జి శ్రీనివాస నాయుడు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పట్నాల గౌరీ గణపతి, తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంఘ అధ్యక్షులు గంగిరెడ్డి శంకర్రావు మాట్లాడుతూ పట్టణంలో నాయి బ్రాహ్మణ కమిటీ హాల్ నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేయాలని భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ భవన నిర్మాణానికి సహకరిస్తానని అన్నారు. అనంతరం వివిధ సంస్కృతిక ఆటల పోటీలను పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, అహ్మదున్నీసా బేగం పలువురు సంఘ సభ్యులు నాయకులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు.

ఉజ్జీవ మహాసభలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 32వ వార్షిక ఉజ్జీవ మహాసభలను విజయవంతం చేయాలని మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పి ఆనంద్ బాబు, కార్యదర్శి రెవరెండ్ కిషోర్ బాబు, కోశాధికారి రెవరెండ్ పి.బన్ను ప్రసాద్, ఉపాధ్యక్షులు బిషప్ పి. జ్ఞానరాజు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ మంగళవారం సాయంత్రం నుంచి ప్రారంభమై డిసెంబర్ ఒకటో తేదీ వరకు సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో 32వ వార్షిక మహాసభలు, క్రిస్మస్ మహెూత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభల్లో ముఖ్య ప్రసంగికులుగా విజయవాడకు చెందిన ఫిలదెల్ఫియ ఏజీ చర్చ్ దైవజనులు రెవరెండ్ చార్లెస్ పి జాకబ్, పెద్దాపురం పట్టణానికి చెందిన బైబిల్ మిషన్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ జీఆర్ ఇమ్మానియేలు, బెంగళూరుకు చెందిన సమర్పన్ డి వర్షిప్ బ్యాండ్ అధినేత ఇవి జోయల్ ఎస్.బాబ్, గ్లోబల్ పీస్ అంబాసిడర్ డాక్టర్ డాక్టర్ కె. బెన్నీ ప్రసాద్‌లు విచేస్తున్నట్లు చెప్పారు. శక్తివంతమైన ఆరాధన, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను సందర్శించి వచ్చిన దేవుని సాక్షి ఆయన బెన్నీ ప్రసాద్ అద్భుత సాక్ష్యం, జీవితాలను మార్చగలిగే శక్తివంతమైన దైవ వర్తమానాలు ఈ సభల్లో ప్రత్యేకత సంతరించుకుంటున్నట్లు చెప్పారు. ఈ సభలో టౌన్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో మధురమైన క్రైస్తవ సంగీతం, ప్రత్యేక గీతాలాపన కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. డిసెంబర్ ఒకటో తేదీన మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ ఆరాధన జరుపుతున్నట్లు చెప్పారు. ఈ ఉజ్జీవ మహాసభలు, క్రిస్మస్ ఆరాధనల్లో ఉభయ తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆత్మీయ మేలులు పొందాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సందర్భంగా సభల గోడపత్రికలను వారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పాస్టర్ అసోసియేషన్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

చొప్పెల్లలో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - ఆలమూరు : అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని చొప్పెల్ల గ్రామంలో సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపనయ్య అధ్యక్షతన మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తపేట శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని ముందుగా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో పర్యటిస్తూ నాలుగున్నర సంవత్సరాలుగా వైఎస్ఆర్ ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కార దిశగా అధికారులు ముందుకు సాగా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోరాటీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటీ సీతా మాలక్ష్మి రాంబాబు, వైసీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆ తమ్ముడ్ని నేను చదివిస్తా

విద్యార్థి ఆవేదన విని స్పందించిన లోకేష్

విశాలాంధ్ర - అమలాపురం : ఆర్థిక ఇబ్బందులతో చదువు మానేసిన ఓ విద్యార్థి ఆవేదనను విన్న టిడిపి యువనేత నారా లోకేష్ చలించిపోయారు. ఆ తమ్ముడ్ని చదివించే బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. అమలాపురం నియోజకవర్గం భట్నవిల్లిలో యువతతో ముఖాముఖి నిర్వహించిన యువనేత వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమలాపురం నియోజకవర్గం కోడురుపాడు చెందిన కె దుర్గారెడ్డి తమ కష్టాలను తెలియజేస్తూ "తాను అమలాపురంలోని ఎస్ కెబిఆర్ కళాశాలలో గత ఏడాది ఇంటర్ హెచ్ఇసి గ్రూప్‌లో చేరానని అన్నారు. అక్కడ సరైన సదుపాయాలు లేక చదువు మానేశానని, తర్వాత ఐటీఐ చదువుతానని నాన్నతో చెబితే మనకు అంత స్తోమత లేదు, వద్దన్నారని పేర్కొన్నాడు. దాంతో టిసి తీసుకొని ఇంటివద్దే ఉంటూ చిన్నచిన్న పనులు చేసుకుంటున్నానని చెప్పాడు. దీంతో యువనేత లోకేష్ స్పందిస్తూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు ఆపేసిన దుర్గారెడ్డిని తాను చదివిస్తానని చెబుతూ సంబంధిత విద్యార్థి వివరాలు తీసుకోవాల్సిం దిగా వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు.

గంగంపాలెంలో రూ. 16 కోట్లతో అభివృద్ధి

విశాలాంధ్ర -గోకవరం: మండలంలోని గంగంపాలెం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా 66 మంది నిరుపేద లబ్ధిదారులకు మంగళవారం జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు చేతుల మీదుగా పట్టాల పంపిణీ చేశారు. తొలుత దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఠాకుర్ పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే చంటిబాబు ప్రారంభించారు. అనంతరం గంగంపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ గంగంపాలెం గ్రామంలో సుదీర్ఘకాలం 40 సంవత్సరాలు పైబడి నుండి పోడు భూముల పట్టాలు లబ్ధిదారులకు ఎంతమంది ఎమ్మెల్యేలు, మంత్రులు మారినప్పటి నుండి ఇప్పటివరకు ఇవ్వలేదని ప్రస్తుత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో భూ హక్కు పట్టాలు పంపిణీలో భాగంగా 66 మంది లబ్ధిదారులకు పోడు భూముల పట్టాలు ఇచ్చినట్టు తెలిపారు. గంగపాలెం గ్రామంలో సుమారు 16 కోట్ల రూపాయలతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

ఎన్‌టి రాజాపురంలో జగనే ఎందుకు కావాలి

విశాలాంధ్ర - గండేపల్లి : ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జెడ్పీటీసీ పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్లీ ఎందుకు ఎన్నుకోవాలో వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. సమస్యలు లేకుండా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ళ దొరబాబు, కుంచె రాజా, కేతిన బాబి, సర్పంచ్ బిక్కిన దేవి దుర్గ, ఎంపీడీవో వెంకటరామన్, తహసిల్దార్ సత్యనారాయణ, ఈఓఆర్ డి మూర్తి, కార్యదర్శి తరంగిణి, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - సీతానగరం: చంద్రబాబుతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యం అని రాజానగరం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. మండలంలో గల రఘుదేవ పురం గ్రామంలో మంగళవారం బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో బాబు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా వెంకటరమణ చౌదరి ఇంటి ఇంటికి తిరుగుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల మ్యానిఫెస్టో గురించి వివరించారు. అలాగే రాష్ట్రానికి వైసీపీ పాలనలో జరుగుతున్న అన్యాయం గురించి తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి తిరోగమనంలో సాగింది అని దుయ్యబట్టారు 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాండ్రు శ్రీనివాస రావు, వలవల రాజా, సంగన చినపోసియ్య, కాశీ, చుండ్రు సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాపులను బీసీల్లో చేర్చాలి

విశాలాంధ్ర - అమలాపురం : జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ అమలాపురం మహిపాల వీధిలో కలిసి వినతి పత్రం సమర్పించారు. తెలుగుదేశం ఆవిర్భావం నుండి జరిగిన అన్ని ఎన్నికలలోనూ కాపు, ఉప కులాల సామాజిక వర్గీయులు తెలుగుదేశం పార్టీకి వెన్నుముకగా నిలిచి పార్టీ అధికారంలోకి రావడానికి విశేష కృషి చేశారన్నారు. తక్షణమే తమను బీసీలుగా గుర్తించి రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగుమళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ జనరల్ సెక్రటరీ, కాకినాడ జిల్లా జెసిఎస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ అన్నారు. జగ్గంపేట సచివాలయం 2 వద్ద ఉప సర్పంచ్, సచివాలయాల మండల కన్వీ నర్ బండారు రాజా అధ్యక్షతన మంగళ వారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా సచివాలయంలో ఏర్పాటు చేసిన డిస్ప్లే బోర్డ్‌ని ఆవిష్కరించారు. అలాగే పార్టీ జెండాలను ఎగురవేశారు. తదుపరి జరిగిన సభలో బండారు రాజా మాట్లాడుతూ గత చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు ఏ మేర నెరవేర్చారో, జగన్ అధికారంలోకి వచ్చిన హామీలు ఏ మేర తీర్చారో రిపోర్ట్ కార్డు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఈఓ పిఆర్‌డి కొండలరావు, వైస్ ఎంపీపీ నక్కా శ్రీను, రాజపూడి సర్పంచ్ బుసాల విష్ణుమూర్తి, మండల కో ఆప్షన్ మెంబెర్ జాన్ వెస్లీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలకు వినియోగదారులు హక్కుల పరిరక్షణ చట్టం,విధి విధానాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం వినియోగదారులు సంఘం అధ్యక్షుడు డి.నారాయణ మూర్తి అధ్యక్షత వహించగా వినియోగదారులు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి హెచ్ఎస్ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా వినియోగదారులు హక్కుల పరిరక్షణ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనివలన కొనుగోలు దారులకు జరుగుతున్న మోసాలపై సత్వర న్యాయం జరగటానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ఎస్‌పి రెడ్డి, ఉపాధ్యాయు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో భారీ అవకతవకలు

విశాలాంధ్ర - కిర్లంపూడి : కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామపంచాయతీ పరిధిలోని చిల్లంగి, జగపతినగరం, కిర్లంపూడి గ్రామాల్లో 2022 -23 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో భారీ అవకతకులు జరిగాయని మూడు గ్రామాలకు చెందిన పలువురు రైతులు, గ్రామస్తులు ఆరోపించారు. మంగళవారం జగపతినగరం పంచాయతీ ఆవరణలో సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అధ్యక్షతన ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో సామాజిక తనిఖీ ప్రజావేదిక డిఆర్పి, డేవిడ్ రాజు ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలో మూడు గ్రామాల్లోను ఉపాధి హామీ పథకంలో చేపట్టిన, చెరువు,కాలువ పనులను వివరించారు. అసలు గత రెండు, మూడు సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకంలో ఎటువంటి కాలువ పనులు చేపట్టకుండా, చేసినట్టు ఎలా చూపిస్తారని మాజీ సర్పంచ్ పెంటకోట కూడా నాగబాబుతో పాటు, కంపరపు నాగేశ్వరరావు పలు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయలతో కాలువ పనులు చేపట్టడం జరిగిందని సభలో డేవిడ్ రాజు వివరించడానికి ప్రయత్నించడంతో గ్రామసభలో రైతులు, పలువురు గ్రామస్తులు ఆశ్చర్య వ్యక్తం చేశారు. కాలువ పనులు చేపట్టకుండా చేసినట్టు ఎలా చెబుతున్నారని గత ఏపీవో చిరంజీవిరావును పలువురు నిలదీశారు. దీంతో గ్రామసభ రసాభసాగా మారింది. దీంతో డిఆర్పి డేవిడ్ రాజు మాట్లాడుతూ గ్రామ సభలో జరిగిన అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఒకటో తారీఖున జరిగే మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వివరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అవకతవకల్లో జరిగిన ప్రతి రూపాయిని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నాగమణి, ఈవోపీఆర్డి మార్కండేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది ధనుంజయ, వైస్ ఎంపీపీ బోడ్డేటి గణపతి, పెనగంటి రాజేష్, ఎంపిటిసి సాదే కుమారి, ఉపాధి సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.